విలేకరులు కావలెను

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్
రాష్ట్రాల వ్యాప్తంగా వెలువడుతున్న
పరివర్తన **అవాజ్ దినపత్రిక**లో
పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్,
నియోజకవర్గ ఆర్.సిలు,
మండల స్థాయి రిపోర్టర్లుగా
పనిచేయుటకు ఉత్సాహం కలిగిన
యువతీ, యువకులు కావలెను.

సీనియర్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును.

పరివర్తన ఆవాజ్

TGBIL/25/A2214 తెలుగు ఉర్దూ దినపత్రిక

PARIVARTHANA AWAAZ

పేపర్‌లో యాడ్స్ కొరకు సంప్రదించండి

9704903467

8886183468

కామారెడ్డి - హైదరబాద్ - వరంగల్ - సంగారెడ్డి 31-10-2026 శనివారం సంపుటి:02 సంచిక : 29 రూ॥ 5-00 పేజీలు : 3

కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్రి ప్రభాకర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు...



వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన అవాజ్ అక్టోబర్ 30 : వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ 56వ డివిజన్ గోపాలపూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మర్రి ప్రభాకర్ ఇటీవల చేయికి గాయమై ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధిగా ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలవడం తన బాధ్యత అని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ, అవసరమైన సమయంలో వారికి భరోసా కల్పిస్తానని తెలిపారు

రాహుల్ గాంధీ పిలుపు మేరకు 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటంలో పాల్గొనేందుకు సిద్ధం



వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన అవాజ్ అక్టోబర్ 30 : అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ పిలుపు మేరకు నవంబర్ 1వ తేదీన ఢిల్లీలో నిర్వహించనున్న 'చలో ఢిల్లీ' కార్యక్రమంలో పాల్గొనేందుకు వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ వైస్ ఛైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, టీపీసీసీ ఉపాధ్యక్షులు నామిండ్ల శ్రీనివాస్ . తో కలిసి ఢిల్లీకి పయనమయ్యారు. దేశంలో ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, రాజ్యాంగ హక్కుల సంరక్షణ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, ఓటు హక్కు పరిరక్షణ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ఈ ఉద్యమంలో భాగస్వాములు కావడానికి ఎమ్మెల్యే నాగరాజు ఢిల్లీకి బయలుదేరారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ప్రతి పౌరుడికి ఉన్న అత్యంత విలువైన హక్కు అని, ఆ హక్కును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ప్రజల ఓటు హక్కుకు భంగం కలగకుండా, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించే దిశగా రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ గళాన్ని వినిపించనున్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సాగుతున్న పోరాటంలో వర్ధన్నపేట నియోజకవర్గం తరపున ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి వందల మంది నాయకులు, కార్యకర్తలు తరలి వస్తున్నారని అన్నారు

నిశ్చితార్థ వేడుకకు హాజరై నూతన జంటకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ...



వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక అక్టోబర్ 30

హైదరాబాద్‌లోని జె ఆర్ సి కన్వెన్షన్‌లో తెలంగాణ సీనియర్ ఐపీఎస్ అధికారి నాగిరెడ్డి కుమార్తె హార్షయతి, గూడం మధుసూదన్ రెడ్డి కుమారుడు సందీప్ రెడ్డి నిశ్చితార్థ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు పటాన్ చెరువు ఎమ్మెల్యే గూడం మహిపాల్ రెడ్డి తో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాబోయే వధూవరులను ఆత్మీయంగా ఆశీర్వదించి, వారి నూతన జీవితానికి శుభాకాంక్షలు తెలియజేశారు. కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ఆప్యాయంగా ముచ్చటించి, వేడుకలో పాల్గొన్నారు. వారి వెంట రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు, రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి

శాఖల వారీగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి నివేదికలు సమర్పించాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక అక్టోబర్ 30: జిల్లాలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఎల్‌నినో ప్రభావంపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా కార్యాచరణ ప్రణాళికలు (యాక్షన్ ప్లాన్) రూపొందించి, చేపట్టాల్సిన నివారణా చర్యల వివరాలతో నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల కలిగే వాతావరణ మార్పులు, వ్యవసాయంపై పడే ప్రభావం తదితర అంశాలపై ప్రజలకు, ముఖ్యంగా రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ముందస్తు జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి పొదుపు చర్యలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ సందర్భంగా సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి (టి ఎస్ ఎస్) కళాకారులు ఎల్‌నినోపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన పాటల సీడీని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆవిష్కరించారు.తూర్పు నియోజకవర్గం టీమ్ లీడర్ జూపాక శివ, గౌరారపు యుగంధర్ తమ కళాబృందంతో రూపొందించిన ఈ పాటల ద్వారా ఎల్‌నినో ప్రభావం వలన తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, రైతులు పాటించాల్సిన వ్యవసాయ పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే కాకుండా, దాని ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన నివారణ చర్యలపై రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని అన్నారు. శాఖల వారీగా అనగా వ్యవసాయ, ఉద్యానవన శాఖ, విద్యుత్, గ్రౌండ్ వాటర్, పశుసంవర్ధ శాఖలు తయారు చేసిన నివేదికల ఆదరంగా ప్రజలకు కళాకారులు తమ పాటల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి,ఎలక్ట్రిసిటీ ఎస్ ఇ ఆనందం సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

అభివృద్ధి పనుల్లో నాణ్యతో సకాలంలో పూర్తి చేయాలి

నాణ్యతలో రాజీ పడితే బిల్లుల్లో కోత తప్పదు

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న



జీడబ్ల్యూఎంసీ,వరంగల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30 పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక : గేటర్ వరంగల్ నగర పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.శుక్రవారం ఉదయం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పూర్తయిన, కొనసాగుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరంగల్ పరిధిలోని కాశీబుగ్గ సర్కిల్, పోతరాజుపల్లి, ఉర్సు, తోట మైదానం, గిర్మాజిపేట, చార్‌బౌలి, లక్ష్మీపురం మార్కెట్ తదితర ప్రాంతాల్లో నిర్మించిన సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల పనులను వరంగల్ చౌరస్తా వద్ద చేపట్టిన పైప్‌లైన్ పనులను తనిఖీ చేశారు. అదేవిధంగా ఖాజీపేట సర్కిల్ పరిధిలోని బంధం చెరువు, ఖాజీపేట దర్గా సమీపంలో, పిస్తా హౌస్ ప్రాంతాల్లో చేపట్టిన పనులతో పాటు శాయంపేటలో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను, ఉర్సు వద్ద నిర్మిస్తున్న యుపిహెచ్సి భవనాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనుల పూర్తిలో ఎలాంటి జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడేది లేదని, నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపడితే సంబంధిత బిల్లుల్లో కోత విధించడం జరుగుతోందని హెచ్చరించారు.అనంతరం శాయంపేటలో పారిశుద్ధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేసి, స్వచ్ ఆటో ప్రతిరోజూ చెత్త సేకరిస్తుందా అని నగరవాసులను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య కార్మికులకు తగిన సూచనలు చేశారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా పారిశుద్ధ్య నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని, పారిశుద్ధ్య పనులపై అధికారులు నిత్యం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సంజయ్ కుమార్, రవికుమార్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి

ఫారం-18 దరఖాస్తుల పరిశీలన, అర్హత ప్రమాణాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలి



వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక అక్టోబర్ 30: వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన శుక్రవారం వరంగల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొని, వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు ప్రక్రియపై ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, అర్హులైన పట్టభద్రులందరికీ ఫారం-18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకునే విధానంపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా స్వీప్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని పేర్కొన్నారు.ఫారం-18 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి.అర్హులైన పట్టభద్రుల నుంచి అందిన ఫారం-18 దరఖాస్తులను ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని, ఎలాంటి దరఖాస్తులు అనవసరంగా పెండింగ్‌లో ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దరఖాస్తులతో సమర్పించిన డిగ్రీ సర్టిఫికెట్లు, మార్కుల మెమోలు, ఇతర విద్యార్హత ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. పట్టభద్రుల ఓటరు నమోదుకు nsÆa T| Ÿ½ú§$ z³ sÁ C²_Ô qT ¢ Ü <Ô] ü£m“ •¿£ý¤‘ –| Ÿm“ •¿£Æ eTH<$ ¿=Ôæ± (De Novo) రూపొందిస్తారని, గతంలో ఓటరు జాబితాలో పేరు ఉన్నప్పటికీ అర్హులైన పట్టభద్రులు తప్పనిసరిగా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.అభ్యర్థులు సంబంధిత పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో సాధారణ నివాసితులై ఉండటంతో పాటు, అర్హత తేదీ 01.11.2026 నాటికి కనీసం మూడు సంవత్సరాల ముందే నిర్దేశిత విద్యార్హతను పొంది ఉండాలని వివరించారు.31.10.2023 లేదా అంతకుముందు డిగ్రీ పరీక్ష ఫలితాలు ప్రకటించబడిన లేదా ప్రచురించబడిన పట్టభద్రులు మాత్రమే మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు.మూడు సంవత్సరాల కాలపరిమితిని డిగ్రీ పట్టా ప్రదానోత్సవం తేదీ ఆధారంగా కాకుండా పరీక్ష ఫలితాలు ప్రకటించిన తేదీ ఆధారంగా లెక్కించాలని స్పష్టం చేశారు.దరఖాస్తుల సమర్పణలో నిబంధనలు పాటించాలి.నేరుగా దరఖాస్తు చేసుకునే వారు విద్యార్హతకు సంబంధించిన అసలు ధ్రువపత్రాలను అధికారులకు చూపించాలి.అసలు ధ్రువపత్రాలను పరిశీలించిన అనంతరం,అవి సరైనవా లేదా , తిరస్కరించబడినవా అనే వివరాలు సంబధిత పరిశీలన అధికారి నమోదు చేయాలన్నారు.తపాలా ద్వారా పంపే దరఖాస్తులకు విద్యార్హత ధ్రువపత్రాల ధ్రువీకరించిన ప్రతులను జతచేయాలి. దరఖాస్తు దారులు సంబంధిత పట్టభద్రుల నియోజక వర్గ పరిధిలో సాధారణ నివాసితులుగా ఉండాలనే నిబంధన తప్పనిసరిగా పాటించాలన్నారు.రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఏజెంట్లు (బి ఏ ఎల్ ఎస్), రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు సమర్పించడానికి అనుమతి లేదని తెలిపారు. విద్యాసంస్థల అధిపతులు తమ సంస్థల్లో పనిచేసే అర్హులైన సిబ్బంది దరఖాస్తులను సమర్పించవచ్చు.ఒకే చిరునామాలో నివసించే అర్హులైన కుటుంబ సభ్యుల తరఫున కూడా తగిన ధ్రువీకరణతో దరఖాస్తులు సమర్పించవచ్చు.ఆన్‌లైన్‌లో ఫారం-18 దరఖాస్తుల స్వీకరణ... అర్హులైన పట్టభద్రులు అవసరమైన విద్యార్హత ధ్రువపత్రాలను జతచేసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఫారం-18 దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.అధికారిక వెబ్‌సైట్: https://ceotserms2.telangana.gov.in/MLC/Form18 అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలి.ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ విద్యాసంస్థల సిబ్బంది, పట్టభద్రులు, సాధారణ ప్రజలకు ఓటరు నమోదు అర్హతలు, దరఖాస్తు విధానంపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అర్హులైన పట్టభద్రులందరూ నిర్ణీత గడువులోగా అవసరమైన ధ్రువపత్రాలతో సంపూర్ణంగా దరఖాస్తులు సమర్పించేలా ప్రోత్సహించాలని ఆదేశించారు.సంబంధిత ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థల అధికారులు అర్హులైన పట్టభద్రులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓటరు నమోదు ప్రక్రియ సజావుగా జరిగేలా ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా ఓటరు జాబితా రూపకల్పన ప్రక్రియను నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కలెక్టర్,అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,హన్మకొండ అదనపు కలెక్టర్ రవి, ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఆర్డీఓలు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

మతసామరస్యం కోసం విస్తృతంగా కృషి చేసిన మోటూరి కృష్ణ ప్రసాద్ మనకు ఆదర్శం - జస్టిస్ చంద్ర కుమార్.

రాజ్యాంగ పరిరక్షణే మనం కేపీకి ఇచ్చే నివాళి – ఈటీ నరసింహ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి



హైదరాబాద్ పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక అక్టోబర్ 30 : వామపక్ష శ్రేయోభిలాషి, భారత్ నేషనల్ మూవ్ మెంట్ జాతీయ కన్వీనర్ మోటూరి కృష్ణ ప్రసాద్ జయంతి సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఇండియన్ నేషనలిస్ట్ మూవ్ మెంట్ (INAM) ఆధ్వర్యంలో స్మారక సభ జాతీయ సెక్రటరీ జనరల్ మహమ్మద్ జుబేర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మేధావులు, వామపక్ష పార్టీల నాయకులు మోటూరి కృష్ణ ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.సభను ఉద్దేశించి జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ మోటూరి కృష్ణ ప్రసాద్ ఓల్డ్ సిటీలో జన్మించి విద్యార్థి దశ నుండే ఉద్యమాల వైపు ఆకర్షితులై అనేక పోరాటాల్లో పాల్గొన్నారని అన్నారు. ఉర్దూ, ఇంగ్లీష్, తెలుగులో అనర్గళంగా ప్రసంగిస్తూ ఎంతో మంది యువతను ఆకర్షించారని, మత ఘర్షణలకు వ్యతిరేకంగా ప్రజల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పేందుకు సంస్థను ఏర్పాటు చేసి అనేక సదస్సులు, సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు.తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్న పాలకవర్గానికి వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్ర డెమోక్రటిక్ ఫోరం ఏర్పాటులో కృష్ణ ప్రసాద్ క్రియాశీలక పాత్ర పోషించారని కొనియాడారు.ఈటీ నరసింహ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజలు పోరాడి సాధించుకున్న అనేక హక్కులను కాలరాస్తోందని అన్నారు. ప్రజాస్వామిక పద్ధతిలో పోరాటాలు నిర్వహిస్తున్న ఉద్యమ నాయకుల గొంతు నొక్కుతూ నిర్బంధాలు విధిస్తోందని, ప్రజలకు జీవించే హక్కుతో సమానమైన ఓటు హక్కును SIR అనే ప్రక్రియ ద్వారా తొలగించేందుకు అనేక కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు.ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగాన్ని రక్షించడం కోసం ప్రజా ఉద్యమాలే పునాది అని, ఢిల్లీ నగరంలో Gen Z చేసిన పోరాటాన్ని చూసి కామ్రేడ్ మోటూరి కృష్ణ ప్రసాద్ బ్రతికి ఉంటే గర్వించేవారని తెలిపారు.కరోనా సమయంలో విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటున్న ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా మందులు తయారు చేసి ప్రజల జీవితాలను కాపాడడంలో ఒక శాస్త్రవేత్తగా కేపీ తన బాధ్యతను నిర్వహించారని గుర్తు చేశారు. అనేక ఆదివాసీ గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి ప్రజలకు విస్తృత సేవలు అందించారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో AIKMA జాతీయ కార్యదర్శి జీ.ఎ చలపతి, IFTU జాతీయ కార్యదర్శి ప్రదీప్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే గోవర్ధన్, సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ ప్రేమ్ పావని, INAM జాతీయ ఉపాధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్ మాజీద్, ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, మహమ్మద్ అబ్దుల్లా, మసియొద్దీన్ అఫ్సర్, ఖైరుద్దీన్ సూఫీ తదితరులు ప్రసంగించారు.

సేవ చేయాలంటే అవసరార్థుల దగ్గరకు మనమే వెళ్లాలి -డాక్టర్ అనితా రెడ్డి





వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక అక్టోబర్ 30: అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి శుక్రవారం హన్మకొండ లోని వాజ్ పై కాలనీ లోని స్లమ్ ఏరియా అంబేద్కర్ నగర్ స్లమ్ ఏరియా, కొన్ని గుడిసెవాసుల ఇండ్లు సందర్శించి వారి పిల్లలు స్కూల్ కి వెలుతున్నారా, ఎవరు డ్రాపవుట్స్ ఉన్నారు, 18 సంవత్సరాలలోపు ఎవరు అయినా బాల్యవివాహాలు చేస్తున్నారా అడిగి తెలిసికొని పరిశీలించారు చదువుకోకపోతే కలిగే నష్టాలు, బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాన్ని వారికి అర్థం అయే రీతిలో చెప్పారు, ఒంటరి మహిళల పధకాలు, వృద్ధాప్య పెన్షన్, దివ్యాంగుల పెన్షన్ పట్ల అవగాహన కల్పించి ఎలా తీసికోవాలి ఎవరిని కలవాలి వంటి విషయాలు వారికి తెలియచేసారు, ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ పథకాలు పేదల వరకు చేరాలంటే మనం ఏసి హాల్లో కూర్చుండి అవగాహన కార్యక్రమాలు నిర్వహించ కూడదని ఎవరైతే అవసరార్థులు ఉన్నారో వారి దగ్గరకు మనం వెళ్లి వారికి అర్థం అయే విధంగా చెప్పాలని ముఖ్యంగా వారి మంచి మనం కోరుతున్నామన్న భావన వారికి కలిగేలా మన ప్రవర్తన ఉండాలని అప్పుడే ప్రతి మంచి పధకం, ప్రతి మంచి చట్టం అమలు చేసే అవకాశం ఉంటుందని అవసరార్థులకు ఆ ఫలాలు అందుతాయని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు, అనంతరం వారి కోసం సేకరించిన బట్టలు పంపిణీ చేయడం జరిగింది,, శరీరాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి తెలిపారు, ఈ కార్యక్రమం లో డాక్టర్ అనితా రెడ్డి, ఉంపెందర్ రెడ్డి, రాఘవ , గుడిసెవాసులు పాల్గొన్నారు.

గుండాలలో కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీలు.. అధికారులకు ఆదేశాలు







భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక అక్టోబర్ 30: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం విస్తృతంగా పర్యటించి భూ రీ సర్వే పనులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. గుండాల రెవెన్యూ పరిధిలో జరుగుతున్న భూ రీ సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్ సర్వే పురోగతిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొత్తం 10,390 ఎకరాల విస్తీర్ణంలో 6,694 ఎకరాలు అటవీ భూములుగా ఉన్నాయని, అటవీ శాఖ గెజిట్ ప్రకారం నిర్దేశించిన హద్దులు, ఎన్‌క్లోజర్ లేయర్ల ఆధారంగా మిగిలిన భూముల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు సుమారు 950 ఎకరాల్లో సర్వే పూర్తికాగా, అందులో 561 ఎకరాల ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించినట్లు సిబ్బంది వివరించారు. రైతుల సమక్షంలోనే భూముల హద్దులను నిర్ధారించాలని, వారి పేర్లు, సంతకాలు, ఆధార్, మొబైల్ వివరాలను ఫీల్డ్ రిజిస్టర్లలో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. పహాణీ, పట్టాదారు పాస్ పుస్తకాల వివరాలతో పాటు ప్రస్తుతం సాగు చేస్తున్న రైతుల వివరాలను కూడా నమోదు చేయాలన్నారు. అటవీ, అసైన్డ్, రెవెన్యూ భూములకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, రైతుల అభ్యంతరాలను సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. సర్వే పూర్తయిన అనంతరం హద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని, భూ రీ సర్వే ప్రక్రియను నవంబర్ 15వ తేదీలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీజీపీఎస్ (డి జి పి ఎస్) పరికరాల పనితీరును కూడా పరిశీలించారు. అనంతరం గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అక్కడ అందిస్తున్న వైద్య సేవలు, రక్త పరీక్షలు, మందుల నిల్వలు, వైద్య పరికరాల లభ్యతపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. మందుల గదిని పరిశీలించగా అత్యవసర వైద్య అవసరాలకు ఉపయోగించే సిరంజీలు అందుబాటులో లేకపోవడాన్ని గుర్తించి కారణాలను ప్రశ్నించారు. ఇంటర్నెట్ సమస్యల కారణంగా మందులు, వైద్య సామగ్రి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇప్పటికే ఇండెంట్ పెట్టామని వైద్యాధికారులు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సిరంజీలు, అవసరమైన మందులు, వైద్య పరికరాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. అనంతరం సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఇన్‌పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యం, మందులు, భోజన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. మారుమూల ప్రాంత ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు.అనంతరం గుండాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న విద్యా బోధన, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, భోజన సదుపాయాలను పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులు లేకపోవడాన్ని గమనించి, తరగతుల సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఏమిటని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. విద్యార్థుల విద్యాభ్యాసానికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, సాంస్కృతిక కార్యక్రమాలను సెలవు రోజుల్లో నిర్వహించుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు.పాఠశాల మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వంటశాల, స్టోర్ రూమ్‌ను పరిశీలించగా బంగాళాదుంపలు కుళ్లిపోయి ఉండటం, పంచదారలో చీమలు పట్టి ఉండటాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన వంట మనిషిని విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్ సాంబార్, రసం పలుచగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోజు ప్రభుత్వ మెనూ ప్రకారం బిర్యానీ వడ్డించాల్సి ఉండగా, అందుకు అనుగుణంగా భోజనం సిద్ధం చేయకపోవడాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని స్పష్టం చేశారు.పాఠశాలలో విద్యార్థుల హాజరు, బోధన, పారిశుద్ధ్యం, భోజన నాణ్యత, ఆహార పదార్థాల నిల్వలో గుర్తించిన లోపాలపై ప్రిన్సిపాల్‌కు మెమో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన వసతులు, పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ పర్యటనలో సర్పంచ్ రాధా, తహసీల్దార్ సంగీత, ఎంపీడీవో బాలరాజు, ఎంఈఓ పార్వతి, ఎంపీవో త్రిలోక్, సర్వేయర్ శివకృష్ణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ అంకిత్

ఆలయ అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిగా డీఆర్ఓ పద్మావతి నియామకం

పుష్కర ఘాట్ల అభివృద్ధి, రహదారుల విస్తరణకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలి

వీఐపీ, వీవీఐపీ అతిథి గృహాల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించాలి



పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక అక్టోబర్ 30 భద్రాచలం:శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ అభివృద్ధి పనుల పురోగతి, వివిధ శాఖల అనుమతులు, గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, వివిధ శాఖల మధ్య సమన్వయం సాధించేందుకు ప్రత్యేక అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతిని నియమిస్తున్నట్లు తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులను వేగవంతం చేయాలని, అవసరమైన ప్రతిపాదనలు, అనుమతులను సంబంధిత శాఖల నుంచి త్వరితగతిన పొందాలని ఆదేశించారు. ఆలయ పునరుద్ధరణ, అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చేపట్టిన పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, నిధులు, అనుమతుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని భద్రాచలంలోని పుష్కర ఘాట్ల అభివృద్ధి, విస్తరణతో పాటు భక్తులకు కల్పించాల్సిన సదుపాయాలపై సమీక్షించారు. పుష్కరాల సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున స్నానపు ప్రదేశాలు, రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రత, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ వంటి సదుపాయాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఘాట్ల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన పనులను గుర్తించి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రామాలయం నుంచి పుష్కర ఘాట్‌కు వెళ్లే మార్గంలో ఉన్న 47 ఇళ్ల తొలగింపునకు సంబంధించిన అంశాన్ని సమీక్షిస్తూ, ఆయా నిర్మాణాల వివరాలు, విలువ అంచనాలు, నిర్వాసితులకు కల్పించాల్సిన పునరావాసం, పరిహారం (ఆర్ అండ్ ఆర్)పై చర్చించారు. బాధితులకు నిబంధనల ప్రకారం పునరావాసం, పరిహారం అందించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.భద్రాచలం బ్రిడ్జిట్ నుండి పుష్కర ఘాట్ లకు రహదారి విస్తరణకు అవసరమైన భూమి, నిర్మాణాలు, భూసేకరణ అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. పుష్కర ఘాట్‌కు అనుసంధానంగా నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పుష్కరాల సమయంలో భక్తులు, యాత్రికుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.భద్రాచలంలో వీఐపీ, వీవీఐపీ అతిథి గృహాల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించాలని సూచించారు. అన్ని వసతులతో ఆరు సూట్లతో కూడిన అతిథి గృహ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో స్థలాలను పరిశీలించి తగిన ప్రదేశాన్ని ఎంపిక చేయాలని తెలిపారు. అవసరమైన భూసేకరణ ప్రక్రియను ప్రారంభించి, సంబంధిత శాఖల అనుమతులతో ప్రతిపాదనలను త్వరితగతిన ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాల నాటికి ఆలయం, ఘాట్లు, పట్టణ పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేలా శాఖల వారీగా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, అధికారులకు అప్పగించిన బాధ్యతలు, పనుల పురోగతికి సంబంధించిన మినిట్స్‌ను తప్పనిసరిగా నమోదు చేయాలని, తదుపరి సమీక్షలో వాటి ఆధారంగా పురోగతిని పరిశీలిస్తామని స్పష్టం చేశారు. పనుల అమలులో ఎదురయ్యే సమస్యలను వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీఓ) సునీత, జిల్లా పంచాయతీ అధికారి అనూష, భద్రాచలం దేవస్థానం ఈఓ దామోదర్ రావు, ఆర్ అండ్ బి ఈఈ నాగేశ్వరరావు, భద్రాచలం తహసీల్దార్ రామ్ కుమార్, దుమ్ముగూడెం తహసీల్దార్ భగవాన్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం. గుంతల రోడ్డుపై గమ్యం చేరేదెలా

పద్మాజివాడి ఎక్స్ రోడ్డు నుండి బాన్సువాడ కి వెళ్లే రహదారి ప్రమాదకరం.

ప్రమాదాలు జరగకముందే అధికారులు రహదారిపై దృష్టి సాధించాలి



కామారెడ్డి జిల్లా పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక అక్టోబర్ 30 : సదాశివ నగర్ మండల పద్మాజివాడి ఎక్స్ రోడ్డు నుండి బాన్సువాడ వైపు వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు రోడ్డుపై ఏర్పడిన గుంతలు వాహనాలు. వెళ్లినప్పుడు లేచే దుమ్ముతో ప్రయాణం ప్రమాదకరంగా మారుతుందోఅని. స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. గుంతలు తప్పించబోయి ప్రమాదాల బారిన పడే పరిస్థితి. ఈ మార్గంలో ప్రతిరోజు ఆర్టీసీ బస్సులు. కార్లు. ఆటోలు. ద్విచక్ర వాహనాలతోపాటు. భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డుపై గుంతల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు గుంతలను తప్పించుకునే క్రమంలో ప్రమాదానికి గురవుతున్నారు కొన్ని రోజుల క్రితం రెండు కారు లు ఢీకొన్నాయి. ప్రజా ప్రతినిధులు సైతం ఇదే రహదారి నుండి ఫంక్షనులకు వివిధ కార్యక్రమాలకు హాజరవుతుంటారు. అయినప్పటికీ రహదారి దుస్థితిపై ఎందుకు దృష్టి సాధించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పద్మాజివాడి ఎక్స్ రోడ్డు నుండి బాన్సువాడ వైపు వెళ్లే రహదారిని సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. ముందుగా గుంతలు పూడ్చి అత్యవసర మరమ్మత్తులు చేపట్టడంతోపాటు అవసరమైన నిధులు కేటాయించి. శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదాలు జరిగి స్థలం గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లిన తర్వాత హడావిడి చేసే కంటే ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు ఈ రహదారిపై దృష్టి సారించి మరమ్మత్తులు చేపట్టాలని కోరుతున్నారు

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నిత్యావసర సరుకుల లభ్యత, ధరలపై ప్రత్యేక సమీక్ష

ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు సరుకుల నిల్వలు అందుబాటులో ఉండాలి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్,



పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక కామారెడ్డి అక్టోబర్ 30 :ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నిత్యావసర సరుకుల లభ్యత, పప్పుధాన్యాల నిల్వలు, మార్కెట్ ధరలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంబంధిత అధికారులు, వ్యాపారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నిత్యావసర సరుకుల సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రజలకు నిత్యావసర సరుకులు నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.మార్కెట్‌లో సరుకుల డిమాండ్‌కు అనుగుణంగా వ్యాపారులు కనీసం 30 నుంచి 45 రోజుల పాటు సరిపడా నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. నిత్యావసర సరుకుల ధరలను కృత్రిమంగా పెంచడం, అక్రమంగా నిల్వ చేయడం, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడటం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లాలో నిత్యావసర సరుకుల లభ్యత, ధరలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, మార్కెట్లలో తనిఖీలు నిర్వహిస్తూ సరుకుల నిల్వల వివరాలు, నిల్వల రిజిస్టర్లు, కొనుగోలు, విక్రయ బిల్లులను పరిశీలించాలని సూచించారు. సరుకుల కొరత ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికతో



